భారీ వాహనాలపై నియంత్రణ


లారీల డ్రైవర్‌లతో మాట్లాడుతున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రెడ్డి

మణికొండ: నార్సింగి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రోజు రోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ కారణంగా ప్రధాన సమయాల్లో భారీ వాహనాలను నియంత్రిస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. సైబరాబాద్ సీపీ ఆదేశాల ప్రకారం జనవరి 1వ తేదీ నుంచి అమలు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. గురువారం ఆయన స్టేషన్ పరిధిలో భారీ వాహనాల అడ్డాలకు వెళ్లి విషయాన్ని డ్రైవర్‌లకు తెలిపారు. ఉదయం 7గంటల నుంచి 11.30గంటల వరకు, సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు రెడీమిక్స్ వాహనాలు, డీసీఎంలు, గూడ్స్‌వాహనాలను అనుమతించమన్నారు. ఉదయం 11.30గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు మాత్రమే వాటిని నడపాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా నియంత్రణ సమయంలో నడిచిన 911 డీసీఎంలు, 1658 టిప్పర్‌లు, లారీలపై ఇప్పటికే కేసులు నమోదు చేశామన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థికి శుభాకాంక్షలు


మహేష్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న జీవన్‌గౌడ్

శంషాబాద్ రూరల్: ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎమ్మెల్యే కోటా నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున నామినేషన్ వేసిన మహేష్‌కుమార్ గౌడ్‌ను గురువారం చిన్నగోల్కొండ సొసైటీ డైరెక్టర్ కె. జీవన్‌గౌడ్ అభినందనలు తెలిపారు. ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువా తో సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీ లను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

కాలభైరవ హనుమాన్ మందిరంలో మహా యజ్ఞం


మహా యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

చార్మినార్: అయోధ్యలో ఈనెల 22న రామ మందిర ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఎక్కడ ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా లోక కల్యాణార్థం పాతబస్తీలో శ్రీరాముని భక్తులు గురువారం ఉదయం మహా యజ్ఞం నిర్వహించారు. కాలభైరవ హనుమాన్ మందిరంలో జరిగిన ఈ పూజా కార్యక్రమాల్లో బీజేపీ గోల్కొండ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.ఉమామహేందర్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. తాము ఇప్పటికే ప్రతిరోజూ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రాణ ప్రతిష్ఠ జరిగే రోజు ప్రత్యక్ష ప్రసారం కోసం బిగ్ స్క్రీన్‌ను ఏర్పాటు చేయడంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నామన్నారు. చార్మినార్ బీజేపీ కన్వీనర్ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద నిత్య అన్నదానం

గోల్కొండ: ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద ప్రతిరోజూ రాత్రి ఉచితంగా అన్నదానం చేస్తున్నామని గోల్కొండ సెకండ్ లాన్సర్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ప్రముఖ సంఘ సేవకుడు మహ్మద్ బషీర్ అన్నారు. గురువారం ఆయన పలు ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద పేషంట్లు, వారి సహాయకులకు భోజన ప్యాకెట్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోల్కొండ ఏరియా ఆసుపత్రి, ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రి, మెహిదీపట్నంలోని సరోజినీదేవి ఆసుపత్రులకు దూర ప్రాంతాల నుంచి చికిత్స నిమిత్తం ఎందరో వ్యక్తులు వస్తుంటారన్నారు. అటువంటి వారికి ఒక్క పూట భోజనం అందించడమే తమ లక్ష్యమని అన్నారు.

అభినందనలు


రాజేంద్రనగర్ పీఎస్ సిబ్బందిని అభినందిస్తున్న సీపీ అవినాష్ మహంతి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ ఉత్తమ పోలీస్‌స్టేషన్‌గా అవార్డు వచ్చిన సందర్భంగా గురువారం సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాష్ మహంతి రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ బి.నాగేంద్ర బాబు, అడిషనల్ డీసీపీ సాధన రష్మీ పెరుమాల్, ఏసీపీ గంగాధర్, అడ్మిన్ ఎస్సై రమేశ్‌తో పాటు సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్రంలోనే రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌కు ఉత్తమ పోలీస్‌స్టేషన్ అవార్డు దక్కడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో ఇకపై కూడా విధి నిర్వహణను కొనసాగించాలని సూచించారు.

22న రచయిత్రి జానకిబాలకు సాహిత్య పురస్కార ప్రదానం

గన్‌ఫౌండ్రీ: ఈ నెల 22న ప్రముఖ రచయిత్రి ఇంద్రగంటి జానకిబాలకు సుశీల నారాయణరెడ్డి సాహితీ పురస్కారాన్ని రవీంద్రభారతిలో ప్రదానం చేయనున్నట్లు రసమయి సంస్థ అధ్యక్షుడు డాక్టర్ ఎం.కె.రాము గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమెకు లక్ష రూపాయల నగదు, జ్ఞాపికతో సత్కరించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు హెచ్‌సీయూలో జాతీయ సదస్సు

రాయదుర్గం: కులగణన, సామాజిక న్యాయం అనే అంశంపై హెచ్‌సీయూలో శుక్ర, శనివారాల్లో జాతీయస్థాయి సదస్సును నిర్వహించేందుకు ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసినట్లు అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు జి కిరణ్‌కుమార్, జాతీయ కార్యదర్శి సాయికిరణ్ తెలిపారు. ఈ సదస్సులో విద్యావేత్తలు, మేధావులు, సామాజిక కార్యకర్తలను ఒకతాటిపైకి తీసుకొచ్చి కులగణనపై ఉన్న అనేక అంశాలను, సందేశాలను చర్చించడం జరుగుతుందన్నారు. వర్చువల్ మోడ్‌లో కూడా జరిగే ఈ సదస్సులో ప్రముఖ విధాన రూపకర్త శ్యామ్ పిట్రోడా, ద్రావిడ కళగం కార్యదర్శి వీరమణి, డీఎంకే రాజ్యసభ సభ్యుడు పి విల్సన్, స్వరాజ అభియాన్ అధ్యక్షుడు యోగేంద్రయాదవ్, ప్రొఫెసర్ వెంకటేష్, ఆళ్ల రామకృష్ణ వంటి ప్రముఖులు పాల్గొంటారన్నారు.

ప్రొ.జయశంకర్ విగ్రహాన్ని ధ్వంసం చేసినవారిపై చర్యలు తీసుకోవాలి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర సిద్ధాంత కర్త ఆచార్య జయశంకర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం అధ్యక్ష కార్యదర్శులు వేములవాడ మదన్‌మోహన్, చొల్లేటి కృష్ణమాచార్యులు డిమాండ్ చేశారు. గురువారం బషీర్‌బాగ్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి ఆల్విన్‌కాలనీలో కొంతమంది దుండగులు తప్పతాగి ప్రొ.జయశంకర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. లాలుకోట వెంకటాచారి, రవీంద్రచారి పాల్గొన్నారు.

మోడల్ మార్కెట్లు!

- అందుబాటులో లేని మోడల్ మార్కెట్‌లు
- వ్యాపారస్తులకు తప్పని అవస్థలు



ప్రేమావతిపేట్‌లో ఏర్పాటు చేసిన మోడల్ మార్కెట్

అత్తాపూర్: స్థానిక ప్రజలకు ఎక్కడికక్కడ పౌష్టికమైన ఆహారాన్ని తయారు చేసుకునేందుకు గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంలో భాగంగా గ్రేటర్ హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో మోడల్ మార్కెట్ వ్యవస్థను తీసుకొచ్చారు. ప్రతి ఒక్కరికి హైజెనిక్ ఫుడ్‌ను అందించాలన్న లక్ష్యంతో రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అప్పటి మంత్రి కేటీ రామారావు 2017లో అట్టహాసంగా మోడల్ మార్కెట్‌లను ప్రారంభించారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన మోడల్ మార్కెట్లను వినియోగంలోకి తీసుకురాకపోవడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైంది. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వమైనా మోడల్ మార్కెట్ వ్యవస్థపై దృష్టి సారించాల్సిన అవసరముంది. ప్రతి మార్కెట్‌లో మాంసం విక్రయ కేంద్రాలు, కూరగాయలు, వివిధ రకాల కిరాణ షాపులు నడుపుకునేందుకు మోడల్ మార్కెట్‌లో దుకాణ సముదాయాలను నిర్మించారు. ఇటీవల జరిగిన ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రజలకు ఉపయోగపడే విధంగా తయారు చేసిన మోడల్ మార్కెట్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని దరఖాస్తులు చేసుకున్నారు. వ్యాపారస్తులు రోజుకొక్క ప్రాంతంలో కూరగాయల అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. మార్కెట్ ఏర్పాటు చేసుకునే రోజుల్లో దళారీ వ్యవస్థ అడ్డగోలుగా అక్రమ వసూలు చేస్తున్నారని వ్యాపారస్తులు వాపోతున్నారు. ఈ మేరకు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ... సమస్య పరిష్కారానికి నోచుకోవడంలదంటున్నారు. స్థానికంగా ఏర్పాటు చేసిన మార్కెట్లను ప్రారంభిస్తే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ప్రాంతా ప్రజలు ఎదురుచూస్తున్నారు. జీహెచ్ఎంసీ అధికారులు రిజర్వేషన్లలో భాగంగా రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ఉన్న మోడల్ మార్కెట్లను అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

మార్కెట్‌లో దళారీలు..



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మొదటిసారిగా ఏర్పాటు చేసిన మోడల్ మార్కెట్ వ్యవస్థను ప్రారంభించాలి. గత ఏడు సంవత్సరాలుగా కోట్లాది రూపాయలతో ప్రారంభించిన మోడల్ మార్కెట్లను ప్రజలకు ఉపయోగకరంగా అందుబాటులోకి తీసుకురాకపోవడంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు విఫలమయ్యారు. స్థానికంగా ఏర్పాటు చేసుకునే మార్కెట్‌ల్లో దళారీలు విచ్చలవిడిగా డబ్బులు వసూలు చేస్తున్నారు. ప్రజాపాలనలో భాగంగా రాజేంద్రనగర్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన మూడు మార్కెట్లను అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను కోరడం జరిగింది.

– రఘు ముదిరాజ్, ప్రేమావతిపేట

షాపులకు బాడుగలు ఎక్కువ..



నగరంలో ఏర్పాటు చేసిన మోడల్ మార్కెట్ వ్యవస్థను రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో 2017లో అప్పటి మంత్రి కేటీ రామారావు ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఏర్పాటు చేసిన మార్కెట్‌లో కులాల వారిగా రిజ్వేషన్లు కల్పించడం జరిగింది. మార్కెట్‌లో ఏర్పాటు చేసిన షాపులకు బాడుగలు ఎక్కువగా ఉన్నందున ప్రజల నుంచి స్పందన లేకుండా పోయింది. కిరాయిలను తగ్గించి రిజర్వేషన్ ప్రక్రియ చేస్తే ప్రజలకు మోడల్ మార్కెట్‌లు అందుబాటులోకి వస్తాయి.

– రవి కుమార్, రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్

అవిశ్వాసంపై పెరుగుతున్న ఉత్కంఠ

బండ్లగూడ: జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌లో అవిశ్వాసంపై ఉత్కంఠ మరింత జఠిలమవుతోంది. గండిపేట మండలం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌పై కలెక్టర్‌కు కార్పొరేటర్లు అవిశ్వాస నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. పాలన పక్ష కార్పొరేటర్లతో పాటు కాంగ్రెస్, భాజపా కార్పొరేటర్లు మొత్తం 16 మంది ఈ అవిశ్వాసం పెట్టారు. తాజాగా మరో కార్పొరేటర్ కూడా వీరికి తోడయ్యే అవకాశం ఉంది. ఈమేరకు చర్చలు కూడా జరుగుతున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా అవిశ్వాసం తెలిపిన కార్పొరేటర్లు గోవాలో మకాం వేశారు. అవిశ్వాసం తేదీని ప్రకటించే వరకు వారంతా అక్కడే ఉండాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి తీర్థయాత్రకు వెళ్లి వచ్చారు. ఈయన కూడా గోవాకే వెళ్తారనే ఊహాగానాలు జోరుగా వినిపిస్తున్నాయి.

ఎంపీ, ఎమ్మెల్యేలను కలిసిన మేయర్

బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కార్పొరేటర్లు అవిశ్వాసం పెట్టడంతో మేయర్ మహేందర్‌గౌడ్ తన మద్దతు కార్పొరేటర్లతో ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను కలుసుకున్నారు. అవిశ్వాసాన్ని వెనక్కి తీసుకునేలా చూడాలని ఆయన కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీ, ఎమ్మెల్యే గోవాలో ఉన్న కార్పొరేటర్లను సంప్రదించి సర్ది చెప్పేందుకు ప్రయత్నిస్తున్నా అటువైపు నుంచి సానుకూల స్పందన లేదన్న సమాచారం ఉంది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మణికొండ: ఇబ్రహీంబాగ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు విద్యుత్ ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు. పుప్పాలగూడ ఫీడర్ పరిధిలో ఉ.11 గంటల నుంచి మ.2 గంటల వరకు మారుతీనగర్, పుప్పాలగూడ గ్రామం, దుర్గానగర్, శివానగర్, రాఘవేంద్ర కాలనీ తదితర ప్రాంతాలలో మరమ్మత్తుల కారణంగా కోత విధిస్తున్నామన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

28, 29 తేదీల్లో హెల్త్ క్యాంప్

గోల్కొండ: ఈ నెల 28, 29వ తేదీల్లో ఉచిత మెగా హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నామని సహాయత ట్రస్ట్ ప్రతినిధి హాఫీజ్ ఇర్ఫాన్ నజీబ్ తెలిపారు. ఇండో యూఎస్ ఆసుపత్రి వారి సహకారంతో 13వ ఇండియా హెల్త్ ఇనిషియేటీవ్‌లో భాగంగా గోల్కొండ నయాఖిలాలోని ఉర్దూ హైస్కూల్‌లో ఈ క్యాంప్ నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. వివిధ విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు రెండు రోజుల పాటు జరిగే ఈ వైద్య శిబిరంలో తమ సేవలు అందిస్తారని, వైద్య పరీక్షలతో పాటు రోగ నిర్ధారణ పరీక్షలు, అవసరమైన వారికి మందులు కూడా ఉచితంగా అందిస్తామని ఆయన తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్య శిబిరం ఉంటుందని ఆయన తెలిపారు.

రేపు వాతావరణ మార్పులపై సెమినార్

అబిడ్స్: వాతావరణంలో కలుగుతున్న మార్పులపై అబిడ్స్ డైమండ్ జూబ్లీ హైస్కూల్‌లో సెమినార్ నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుజాత గాడే వెల్లడించారు. ఈ నెల 20న పాఠశాల 4వ అంతస్తులోని ఆడిటోరియంలో ఉదయం 11 గంటలకు వాతావరణం మార్పుల కారణాలు తీసుకునే జాగ్రత్తలపై విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు.

పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలి


బుల్కాపూర్ నాలాను పరిశీలిస్తున్న బల్దియా కమిషనర్ రోనాల్డ్ రోస్, ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలోపెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ బల్దియా కమిషనర్ రోనాల్డ్ రోస్‌ను కోరారు. గురువారం కమిషనర్‌తో కలిసి ఆయన నానల్‌నగర్, టోలిచౌకీ, గోల్కొండ తదితర డివిజన్‌లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులతో పాటు బుల్కాపూర్ నాలా పనులను కూడా పరిశీలించారు. బుల్కాపూర్ నాలా విస్తరణ పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. వర్షాకాలంలో బుల్కాపూర్ నాలా పొంగిపొర్లుతూ పరిసర ప్రాంతాల వారిని భయభ్రాంతులకు గురిచేస్తుందని ఆయన అన్నారు. కార్వాన్, లంగర్‌హౌస్ తదితర ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా మారాయని, రోడ్ల పనులను వెంటనే చేపట్టాలని ఆయన కోరారు. పలు ప్రాంతాల్లో బాక్స్ టైప్ డ్రైనేజీ పనులు ఇంకా పూర్తి కాలేదని ఆ పనులు నెమ్మదిగా జరుగుతున్నాయన్నారు. దీన్ని వల్ల ఆ ప్రాంతాల్లో స్థానికులే కాకుండా ఆదారి గుండా రాకపోకలు సాగించే వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, హారూన్‌ఫరాన్‌తో పాటు బల్దియా అధికారులు ఉన్నారు.

నేడు నార్సింగిలో పశుసంక్రాంతి

- నిజాం కాలంలో మొదలైన పశువుల సంత
- ఏర్పాట్లన్నీ పూర్తి


నార్సింగిలో పశుసంక్రాంతికి అమ్మకానికి తీసుకొచ్చిన గేదెలు

మణికొండ: నిజాం కాలంలో మొదలైన పశుసంక్రాంతి ఒరవడి హైదరాబాద్ నగర శివారు నార్సింగిలో నేటికీ నిరాటంకంగా కొనసాగుతుంది. పంటలన్నీ ఇంటికి చేరి అవి అమ్మగా వచ్చిన డబ్బులతో రైతులు సంక్రాంతి పండగను ఘనంగా జరుపుకుంటారని అందరికీ తెలుసు. మిగిలిన డబ్బుతో తమ పంటలకు తోడుగా పాడిపశువులను కొనుగోలు చేసే సంస్కృతికి చిహ్నంగా నిలిచేదే ఈ పశుసంక్రాంతి. ఒకప్పుడు నార్సింగి కుగ్రామంగా ఉన్న సమయంలో ప్రారంభమైన ఈ సంస్కృతి నేడు మున్సిపాలిటీగా అవతరించిన నేటికి కొనసాగుతుండటం అందరినీ అబ్బురపరుస్తుంది. ప్రతి సంవత్సరం సంక్రాంతి పండగ తరువాత వచ్చే శుక్రవారం పశుసంక్రాంతిగా నిర్వహిస్తారు. దాంతో గుజరాత్, హర్యానా, పంజాబ్, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి వేలాది గేదెలు, ఆవులను వ్యాపారులు ఇక్కడకు తెచ్చి అమ్ముకుంటారు. దశాబ్దలుగా కొనసాగుతున్న పశుసంక్రాంతిని నేడు నిర్వహించేందుకు మార్కెట్ కమిటీ అధికారులు, మున్సిపల్ ప్రజా ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. నార్సింగి పశుసంక్రాంతికి దేశవ్యాప్త చరిత్ర ఉన్న, మార్కెట్ కమిటీని అనుకున్న స్థాయిలో అభివృద్ధి చేయటంలో ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి. ప్రతి సంవత్సరం నార్సింగి పశుసంక్రాంతికి వచ్చే గేదెలు, ఆవులు రికార్డు ధరలు పలికి అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తాయి.


ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటేశ్‌యాదవ్


సంతకు తరలివస్తున్న పశువులను పరిశీలిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్

ఏర్పాట్లను పరిశీలించిన వైస్ చైర్మన్...

నార్సింగిలో పశుసంక్రాంతికి వివిధ రాష్ట్రాల నుంచి ఇప్పటికే వందలాది గేదెలు, ఆవులు తరలివచ్చాయి. శుక్రవారం ఉదయం వరకు మరిన్ని పెరిగే అవకాశం ఉన్నదని మార్కెట్ కమిటీ వర్గాలు పేర్కొన్నాయి. వాటిని అమ్ముకునేందుకు వీలుగా మార్కెట్ కమిటీ ప్రాంగణంలో అన్ని ఏర్పాటు చేశామన్నారు. పనులను మార్కెట్ కమిటీ చైర్మన్ డి. వెంకటేశ్‌గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ జి. వెంకటేశ్‌యాదవ్ గురువారం పర్యవేక్షించారు. మార్కెట్ కమిటీ పాలక కమిటీని ఇటీవలనే కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయమని ప్రకటించినా అమలు కాకపోవటంతో తమ కమిటీ ఆధ్వర్యంలోనే ఈ సారి పశుసంక్రాంతి చేస్తామని మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం ఉదయం 10గంటలకు పశుసంక్రాంతిని స్థానిక ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ ప్రారంభిస్తారని చైర్మన్, వైస్ చైర్మన్‌లు తెలిపారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళులు


చిత్రపురిలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించిన నాయకులు

మణికొండ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు 28వ వర్థంతిని పురస్కరించుకుని గురువారం చిత్రపురి కాలనీలోని ఆయన విగ్రహానికి ఘన నివాళులు అర్పించారు. చిత్రపురి హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు వి. అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నిర్మాతల కౌన్సిల్ కార్యదర్శి ప్రసన్నకుమార్‌లు మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆరాధ్యదైవంగా వారి హృదయాల్లో నిలిచిన వ్యక్తి ఎన్టీఆర్ అన్నారు. పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రిగా అనేక పథకాలను ప్రవేశపెట్టి సంక్షేమ రంగంలో చెరగని ముద్ర వేశారన్నారు. మణికొండ కమ్మ సంఘం అధ్యక్షుడు బ్రహ్మజీ, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

అత్తాపూర్: స్వార్థ రాజకీయాలకు పాల్పడే పార్టీలను 9 నెలల కాలంలోనే తెలుగు ప్రజల ఆత్మ గౌరవం చరిత్రపుటల్లో ఎక్కించిన ఘనత మహానటుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావుకే దక్కుతుందని తెలంగాణ రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధి మ్యాడం రామేశ్వర్‌రావు అన్నారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 28వ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం హైదర్‌గూడ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామేశ్వర్ రావు మాట్లాడుతూ... రాజకీయాల్లో ఓనమాలు నేర్పించిన ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు అని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకి పూర్వపు రోజులు వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అంకితభావం, క్రమశిక్షణ కలిగిన పార్టీ తెలుగు దేశం పార్టీ అని.. తమ పార్టీ క్యాడర్ గట్టిగా పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ సీనియర్ నాయకులు సోమవారం రాజ కుమార్, ఎస్. శేఖర్ రెడ్డి, కె. దామోదర్ రావు, రఘురాజ్ గౌడ్, టి. మధుకర్, మహ్మద్ ఆజం, ఎం. జయంతిరావు, కొండారెడ్డి, సోమేష్ గౌడ్, కృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు


దివంగత ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

క్రైం కార్నర్..

వాచ్‌మెన్ ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన ఆంజనేయులు

అత్తాపూర్: మద్యం మత్తులో కుటుంబ సభ్యులతో గొడవపడిన ఓ వ్యక్తి ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... అత్తాపూర్ గోల్డెన్ ప్యాలెస్ హోటల్ బ్యాక్‌సైడ్ ఉన్న ఎస్ఆర్‌డీజీ స్కూల్‌లో పెంకుల ఆంజనేయులు (50) గత కొంతకాలంగా వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అంజనేయులు విధి నిర్వాహణలో భాగంగా పాఠశాల ముగిసిన తరువాత మద్యం సేవించి ఇంటికి వెళ్లేవాడు. మద్యం సేవించిన విషయాన్ని గమనించిన ఆంజనేయులు భార్య గొడవ పడింది. దీంతో ఆంజనేయులు కుటుంబ సభ్యులు ఎవరూ లేని సమయంలో రూమ్‌లోకి ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మృతదేహన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ లక్ష్మీనారాయణ

మణికొండ: ఇంట్లో ఎవరు లేని సమయంలో చోరబడి డబ్బులు తస్కరించిన ఇద్దరు నిందితులను నార్సింగి పోలీసులు అరెస్టు చేశారు. నార్సింగి ఏసీపీ ఎస్. లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం గండిపేట్‌లోని ఫీల్ గుడ్ హోమ్స్‌లో నివాసం ఉంటున్న రాధాకృష్ణ పెట్రోల్ బంక్ నిర్వహిస్తున్నాడు. ఈ నెల 13వ తేదీన కలెక్షన్ తీసుకువచ్చి ఇంట్లోని అల్మారాలో 11 లక్షల రూపాయలు భద్రపరిచాడు. మరుసటి రోజు తొగర్‌పల్లిలోని సొంత ఊరికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. 17వ తేదీన రాత్రి సమయంలో ఇంటికి వచ్చి చూడగా ఇంట్లో దాచి పెట్టిన డబ్బులు కనిపించలేదు. దీంతో నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన వద్ద పని చేస్తున్న అలవర్తి రవి, కల్లపల్లి సుధాకర్‌లపై అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సాయంత్రం నిందితులను సంగారెడ్డిలో అరెస్టు చేసి వారి వద్ద నుంచి 10.35 లక్షల నగదు స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించారు.

రైలు ఢీకొని యువకుడు మృతి


రైల్ పట్టాలపై మహమ్మద్ షరీఫ్ మృతదేహం

మైలార్‌దేవ్‌పల్లి: రైలు పట్టాలు దాటుతూ యువకుడు మృతి చెందిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ..వట్టేపల్లి నవాబ్‌సాబ్ కుంట ప్రాంతానికి చెందిన మహమ్మద్ షరీఫ్ (40) రైలు పట్టాలపై నడుచుకుంటు వెళ్తుండగా వెనుక నుంచి రైలు ఢీకొట్టగా యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వ్యక్తి అదృశ్యం


చెన్నయ్య (ఫైల్)

శంషాబాద్: వ్యక్తి అదృశ్యమైన సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని హుడా కాలనీలో నివాసం ఉండే ఎల్లాపు చెన్నయ్య (40) ఈ నెల 7 సొంతూరు మహబూబ్‌నగర్ వెళ్లేందుకు డబ్బులు లేవని ఊర్లో ఉన్న తన భార్యకు ఫోన్ చేసి చెప్పాడు. దీంతో భార్య చంద్రకళ హుడాకాలనీలో తాము నివాసం ఉండే పక్కింటి వారికి ఫోన్ చేసి డబ్బులు సర్దుబాటు చేసింది. డబ్బులు తీసుకుని ఊరికి వస్తున్నట్లు చెప్పిన చెన్నయ్య అక్కడికి చేరుకోలేదు. గత పదిరోజులుగా అన్నిచోట్ల వెతికిన ఆచూకి లభించకపోవడంతో భార్య ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.